క్లుప్తంగా...

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

జియాగూడ: జియాగూడ భారత అభ్యుదయ ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల వ్యవస్థాపక ట్రస్ట్ సభ్యుడు కె.కమల్‌ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్, ఉపాధ్యాయులు శేఖర్‌రెడ్డి, కిషన్‌జీ తదితరులు హాజరై పూర్వ విద్యార్థులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 10వ తరగతి చదివి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సుమారు 20 ఏళ్ల తర్వాత ఒకరినొకరు పలకరింపులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. చివరగా నిరుపేద విద్యార్థులకు ఉచితంగా షూష్, బ్యాగ్‌లను అందజేశారు.

శ్రీనివాస్‌రెడ్డికి సత్కారం



శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న క్రాంతికుమార్ తదితరులు

అఫ్జల్‌గంజ్: తెలంగాణ మార్క్‌ఫెడ్ ఎండీ వి.శ్రీనివాస్‌రెడ్డికి వాణిజ్య పన్నుల శాఖ హైదరాబాద్ రూరల్ డివిజన్ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు క్రాంతి కుమార్, కిరణ్ కుమార్‌రెడ్డి, నందుకుమార్, అరుణ్‌చారి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆయనను సత్కరించి అభినందించారు.

బూర్గుల రామకృష్ణారావుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి మణిలాల్‌షా తదితరులు

అబిడ్స్: దివంగత మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో టీపీసీసీ కార్యదర్శి మణిలాల్ షా, ఇతర రాష్ట్ర నాయకులు కుమార్‌రావు, రాంచందర్‌రావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మణిలాల్ షా మాట్లాడుతూ..ఉమ్మడి తెలుగు రాష్ట్రాల తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన బూర్గుల రామకృష్ణారావు రాష్ట్రానికి చేసిన సేవలు అమోఘమని కొనియాడారు.

అగర్వాల్ సమాజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం

గన్‌ఫౌండ్రీ: మహారాజ అగ్రసేన్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో బాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎల్బీస్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సమాజ్ స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ రమేష్‌కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ..మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. పురుషులు, మహిళల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ ఉంటాయని 8 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వరకు ఉన్న క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనబోతున్నట్లు తెలిపారు. అగర్వాల్ సమాజ్ మానసరోవర్ శాఖ ద్వారా నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలకు 140 మందికి పైగా క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిల్ అగర్వాల్, టోర్నమెంట్ కన్వీనర్లు మనీష్, రాజేష్, రాహుల్ గోయల్, అవిరల్ బన్సాల్, రోహిత్‌జైన్, ముఖేష్ కుమార్ పాల్గొన్నారు.

జింక మాంసాన్ని విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

గోల్కొండ: జహీరాబాద్ అడవుల్లో జింకల్ని వేటాడి..వాటి మాంసాన్ని నగరంలో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ ఆదివారం టోలిచౌకి పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించిన వివరాల మేరకు..టోలిచౌకి సబ్జా కాలనీకి చెందిన మహ్మద్ సలీం, మహ్మద్ ఇక్బాల్‌ల వద్ద జింక మాంసం ఉన్నదని పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్ నాయక్ మహ్మద్ సలీం ఇంటిపై దాడి చేయగా..ఐదు కిలోల జింక మాంసం, మూడు జతల జింక కొమ్ములు లభించాయి. వృత్తిరీత్యా డాక్టర్ అయిన మహ్మద్ సలీం మూసాకు జహీరాబాద్ సమీపంలో ఫామ్‌హౌస్ ఉంది. అక్కడ జింకలను తన లైసెన్స్‌డ్ రైఫిల్‌తో వేటాడి నగరానికి తెచ్చాడు. సబ్జా కాలనీలోని తన ఇంట్లో జింక మాంసాన్ని అమ్మడానికి సిద్ధంగా ఉంచాడు. ఇతనికి మహ్మద్ ఇక్బాల్ సహాయంగా ఉండేవాడు. ఈ క్రమంలో పోలీసులకు పట్టుబడ్డాడు.

కవర్లు కట్టేసి.. బజార్‌లో పడేసి..

- రహదారులు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వేస్తున్న చెత్త
- ప్రమాదాలకు ఆస్కారం
- అవగాహన కల్పించినా కొందరిలో మారని తీరు
- శుభ్రతను బాధ్యతగా భావించాలని అధికారుల విజ్ఞప్తి



గౌలిపురా మార్కెట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేసిన చెత్తాచెదారం



గౌలిపురా గంగపుత్ర సంఘం సమీపంలో..

గౌలిపురా: కరోనా మహమ్మారీ నేర్పిన గుణపాఠంతో శుచి శుభ్రతపై అవగాహన పొందిన ప్రజలు ఆ అంశాన్ని కేవలం తమ ఇంటి వరకే పరిమితం చేసుకుంటున్నారు. మనం, మన ఇల్లు మాత్రం శుభ్రంగా ఉండాలని భావిస్తూ ఇంట్లోని చెత్తను మాత్రం బజార్‌లో ఎక్కడైనా పడేస్తే చాలు అనే ధోరణిని అవలంబిస్తున్నారు. రోజు విడిచి రోజు ఇంటింటికీ వచ్చే చెత్త సేకరణ ఆటోకు నెలకు రూ.వంద ఇవ్వడం కూడా భారంగా భావిస్తున్న కొందరు ఇంట్లోని చెత్తను కవర్లలో బైక్‌పై ఫ్యాషన్‌గా తీసుకెళ్లి రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ పడేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటి వరకు ప్రధాన కూడళ్ల పక్కన ఇలా చెత్త పడేస్తున్న వారిపై జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానికులు చర్యలకు దిగుతుండడంతో కొత్త పంథాను ఎంచుకుంటున్నారు. అక్కడ..ఇక్కడ కాకుండా ఏకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చెంతన చెత్తను పడేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. గౌలిపురా డివిజన్‌లోని పలు బస్తీలలో ఎక్కడ చూసినా ఇలాంటి దృశ్యాలు దర్శనమిస్తున్నాయి.

వినియోగదారుల సేవలకు ఆటంకం..

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వర్షాలు కురిసిన సమయంలో సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతుంటుంది. ముఖ్యంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్దే ఫ్యూజ్ వైర్లకు సంబంధించిన సమస్య తలెత్తుతుంటుంది. వినియోగదారులకు కలిగే అసౌకర్యాన్ని పరిష్కరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు చేరుకుంటున్న విద్యుత్ సిబ్బందికి ఈ చెత్తాచెదారం ఆటంకంగా మారుతున్నాయి. పెద్ద ఎత్తున పోగవుతున్న ఈ డంప్‌లో నుంచి వెళ్లి సమస్య పరిష్కారం చేసేందుకు సిబ్బంది తలలు పట్టుకోవాల్సి వస్తుంది. ఒక్కోసారి దారిన పోయే దానయ్యలు ఏ 'బీడీ, సిగరేటో' తాగి ఈ చెత్త కుప్పల్లో పడేస్తుండడంతో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు కూడా స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త వేసే వారిపై భారీగా జరిమానాలు విధించాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు.

చెత్తను ఆటోరిక్షా కార్మికులకు అందజేయాలి..



ప్రజలు చెత్తను ఆటోరిక్షా కార్మికులకు అందజేయాలి. ఇంట్లోని చెత్తాచెదారాన్ని ప్రజలు ఎక్కడ పడితే అక్కడే వదిలేస్తుండటంతో స్థానిక ప్రాంతాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. ఇంటి పరిసరాలను ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచుతామో..అదే విధంగా బస్తీలు, కాలనీలను కూడా ప్రజలు పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలి.

– వట్టిపల్లిప్రణీత్, హనుమాన్‌నగర్

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వేయొద్దు..



ప్రజలు తమ ఇంట్లోని చెత్తను ఎట్టి పరిస్థితుల్లో ట్రాన్స్ ఫార్మర్ల వద్ద వేయొద్దు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వేయడంతో గాలి దుమారంతో పాటు ప్రజలు బీడీ, సిగరేట్ తాగి పడేయడంతో అగ్ని ప్రమాదం జరిగే అవకాశముంది. ప్రజల భద్రత, ఆరోగ్య దృష్ట్యా చెత్తను ఎక్కడ పడితే అక్కడ కాకుండా ఇంటి వద్దకు ఆటోరిక్షా కార్మికులకు అందజేయాలి. ప్రజలు తమ పరిసరాలు, బస్తీలు, కాలనీలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే వారు ఆరోగ్యంగా ఉంటారు.

– పొలుగారి దస్తగిరి, ఛత్రినాక ఏఈ

బీఆర్‌ఎస్ హయాంలోనే గోషామహల్ అభివృద్ధి



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గోషామహల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు జరిగాయని నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కొన్ని సంవత్సరాలుగా చుడిబజార్‌లో అర్ధంతరంగా ఆగిపోయిన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులను పునరుద్ధరించేందుకు రూ.64 లక్షల నిధులు విడుదల చేయించిన ఆనంద్‌కుమార్ గౌడ్‌కు బస్తీవాసులు ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..తాము అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల అభివృద్ధే ముఖ్యమన్నారు. బస్తీవాసులు తమ దృష్టికి తెచ్చిన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి నిధులు విడుదల చేయించానని వివరించారు. సహకరించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌కు, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ శివకుమార్, ఆర్.సుమన్‌కుమార్, వెంకటేష్, అనిల్, మనోజ్, శ్రీహరి, క్రాంతికుమార్, వేణు, శ్రవణ్‌కుమార్, ధన్‌రాజ్, ధీరజ్, శేఖర్ పాల్గొన్నారు.

హైదరాబాద్ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: హైదరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన షేక్‌పేట్‌లో కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మారుతీనగర్‌లో పర్యటించి స్థానికులను కలుసుకుని వారి సమస్యలను విన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..షేక్‌పేట్‌లోని బస్తీలు, కాలనీల్లో కావాల్సిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో వచ్చే రెవెన్యూను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం దానికి తగ్గట్లుగా నిధులు కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. నగరంలో ఎన్నో ప్రాంతాల్లో వీధిలైట్లు వేయలేని పరిస్థితిలో బల్దియా ఉందన్నారు. హైదరాబాద్ నగరం తెలంగాణ దర్పణమని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి తగిన నిధులు కేటాయించాలని ఆయన అన్నారు.

'అధిష్టానం ఆదేశిస్తే జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేస్తా'



నాయకులు, కార్యకర్తలతో అంజన్‌కుమార్

గోల్కొండ: పార్టీ అధిష్టానం ఆదేశిస్తే జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లోని డైమండ్‌హిల్స్ కాలనీలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా గతంలో రెండుసార్లు పనిచేశానని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంపై తనకు మంచి పట్టు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలతో పాటు బీసీలు, దళితుల అభ్యున్నతి కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, నిజాముద్దీన్, అజీజ్, మోయిన్, సి.రాజు తదితరులు ఉన్నారు.

పాతబస్తీలో మినీ బస్సులు నడపాలి

చార్మినార్: పాతబస్తీలో ఇప్పటికీ అనేక అంతర్గత బస్తీలున్నాయి. ఈ బస్తీలకు కొన్నింటికి బస్సు సౌకర్యమే లేకపోగా..మరికొన్ని బస్తీలకు పెద్ద బస్సులను నడుపుతున్నారు. ఒకటి రెండు చోట్ల మాత్రమే మినీ బస్సులు అందుబాటులో ఉన్నాయి. అవి కూడా సెట్విన్ మినీ బస్సులు కావడం గమనార్హం. అంతర్గత బస్తీల్లోని ప్రయాణికులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన మినీ బస్సులు ఆశించిన ఫలితాలను సాధించడం లేదు. మినీ బస్సులను గల్లీల్లో కాకుండా ప్రధాన రోడ్లలో మాత్రమే నడపడానికి సంబంధిత ఆర్టీసీ అధికారులు ఆసక్తి కనబరుస్తున్నారు. పూర్తి స్థాయిలో బస్తీల్లో మినీ బస్సులను నడపడంలో ఆర్టీసీ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఇరుకైన రోడ్లు..మూల మలుపులున్న రహదారులలో సైతం అక్కడక్కడ పెద్ద బస్సులనే నడుపుతుండడంతో ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

పెద్ద బస్సులతో తలెత్తుతున్న సమస్యలు..

పెద్ద బస్సులతో ఆయా రూట్‌లలో వెళ్లేందుకు ఆర్టీసీ సిబ్బంది జంకడంతో పాటు ప్రయాణికులకు సమస్యలు తలెత్తుతున్నాయి. చిన్న చిన్న వాహనాల నడుమ ఇరుక్కుపోతున్న ఆర్టీసీ పెద్ద బస్సులు ముందుకు కదిలేందుకు తీవ్ర సమయం తీసుకుంటుండడంతో తోటి వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికే చిన్న చిన్న ప్రమాదాలు సైతం చోటు చేసుకున్నాయి. ఇకనైనా మినీ బస్సులను నడపాలని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు



వైద్యులను సత్కరిస్తున్న మాజీ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: సేవా సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రుల వారు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలతో బస్తీల్లోని పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో స్థానిక వీఆర్4 సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్, శ్రీధర్ క్లినిక్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితిలో ప్రతి ఒక్కరూ తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్య సేవలు అందించిన డాక్టర్లను ఘనంగా సన్మానించారు. సేవా సంస్థ నిర్వాహకుడు లక్ష్మణ్‌రావు, డాక్టర్ ప్రభావతి, మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, నాయకులు కిరణ్ కుమార్, పురుషోత్తం, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఉచిత వైద్యం అందించడమే లక్ష్యం



అవార్డు అందుకుంటున్న డాక్టర్ నాగేశ్వర్‌రావు

లంగర్‌హౌస్: అందరికీ ఉచిత వైద్యం అందించడమే తన లక్ష్యమని రేనోవా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ వి.నాగేశ్వర్ రావు అన్నారు. ఆదివారం నగరంలో ఏసిటి నా ఎన్జీవో ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైతులకు అవార్డులు అందించారు. ఇందులో భాగంగా లంగర్‌హౌస్ రెనోవా ఆసుపత్రి డైరెక్టర్ వి.నాగేశ్వర్‌రావుకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును అందజేశారు. ఆయన వన్ భారత్ నేషనల్ హెల్త్ కార్డు ఆలోచనలను కేంద్రానికి, రాష్ట్రాలకు ప్రతిపాదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వానికి కాని ఇటు ప్రజలకు కాని భారం కాకుండా ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా రూ.5లక్షల ఉచిత బీమా ప్రతి పౌరుడికి ఎలా అందించాలనే ఆలోచనను రూపకల్పన చేశామన్నారు. తన ఆలోచనను గుర్తించి తనకు అవార్డు ఇవ్వడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఈ సందర్భంగా ఆయనను డాక్టర్ శివకుమార్ తదితరులు అభినందించారు.

ప్రాచీన నాట్య ప్రక్రియను భవిష్యత్ తరాలకు అందించాలి



కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారిని సత్కరిస్తున్న దైవజ్ఞాశర్మ తదితరులు

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ వారసత్వ సంపద అయిన ప్రాచీన నాట్య ప్రక్రియను భవిష్యత్ తరాలకు అందించాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి అన్నారు. ఆదివారం రవీంద్ర భారతిలో జై జవాన్ జై కిసాన్ జై కళాకార్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువందనం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాట్యకళ అద్భుతమైన ప్రక్రియ అని కొనియాడారు. నాట్యం చేయడం వల్ల ఆరోగ్యంగా, ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. చిన్నారులను నాట్యంపై ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. గురువులను గౌరవించడం మన సంస్కృతి అని ఆ సంస్కృతిని మరిచిపోవద్దని పిలుపునిచ్చారు. అంతకు ముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాందాస్ తేజావత్, సినీ నటి కావ్య, మాస్టర్ నేహాంత్, చకిలం అసోసియేట్ ఎండీ చకిలం సుధాకర్, సంస్థ వ్యవస్థాపకులు వెంకటరమణారావు పాల్గొన్నారు.

మోదీ పథకాలతోనే బీజేపీకి ఆదరణ



క్రాంతికిరణ్‌ను సత్కరిస్తున్న జనార్దన్, శ్రీకాంత్ తదితరులు

అబిడ్స్: ప్రధాని నరేంద్రమోదీ సంక్షేమ పథకాలతోనే బీజేపీకి ఆదరణ లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు క్రాంతికిరణ్ పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన ఆయనను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీజేవైఎం నాయకులు జనార్దన్, శ్రీకాంత్, జగపతి, సాయికిరణ్, ప్రమోద్, అరుణ్ ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ..తెలంగాణలో బీజేపీ పటిష్టంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీదే విజయమన్నారు.

అధైర్యపడవద్దు అండగా ఉంటా



గురుబ్రహ్మనగర్ బస్తీలో పర్యటిస్తున్న ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ నందగిరిహిల్స్ సమీపంలోని గురుబ్రహ్మనగర్ బస్తీలో ఆదివారం ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పర్యటించారు. ఇక్కడ రోడ్డు నిర్మాణం కోసం 12 గుడిసెలను తొలగించాలని ఇటీవల అధికారులు సూచించిన నేపథ్యంలో ఆ ప్రాంతంలో పర్యటించి ఆమె ఒక దగ్గర 10 గుడిసెలు, ఇంకో దగ్గర 5 గుడిసెలు, మరో దగ్గర 3 గుడిసెలు.. ఇలా ఇష్టానుసారంగా ఎక్కడంటే అక్కడ గుడిసెలు కూల్చడమేంటని ప్రశ్నించారు. ఏదైనా నిర్ణయం తీసుకుంటే బస్తీ అంతటికీ ఒకే విధంగా ఉండాలని కోరారు. అధైర్యపడవద్దని, ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని బస్తీవాసులకు హామీ ఇచ్చారు. ఇలాంటి చర్యలు మంచివి కావని హితవు పలికారు.

పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలి



కళాకారులతో దామోదర్‌గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: చిన్నతనం నుంచే పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. ఆదివారం ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా భాస్కర ఆడిటోరియంలో కూచిపూడి కళాక్షేత్రం 3వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మాగంటి వసుధ కళాక్షేత్రాన్ని స్థాపించి అనేక మంది కళాకారులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకోగా పలువురు నాట్య గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామ్‌దాజ్ తేజావత్, తెలుగు విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ రత్నశ్రీ సుధాకర్, సునామి సుధాకర్, భారత్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు లయన్ కేవీ రమణారావు, సంస్థ వ్యవస్థాపకురాలు వసుధ పాల్గొన్నారు.

పాతబస్తీలో శాంతియుతంగా మిలాద్ ర్యాలీలు

- పలు ప్రాంతాల నుంచి కొనసాగిన ర్యాలీలు
- వీధుల్లో ఆహార పదార్థాల అందజేత
- కొనసాగిన ట్రాఫిక్ ఆంక్షలు



చార్మినార్: పాతబస్తీలో ఆదివారం మిలాద్ ర్యాలీలు శాంతియుతంగా జరిగాయి. వీధులన్నింటినీ ఆకర్షణీయమై రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర నియోజకవర్గాల్లోని ముస్లింలు సమూహిక ర్యాలీలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పాతబస్తీ వీధుల్లో ఈ ర్యాలీలు కొనసాగాయి. యువకులు ద్విచక్ర వాహనాలతో ఉత్సాహంగా ర్యాలీలు నిర్వహించారు. అనుమతి లేని ప్రాంతాల్లో సైతం యువకులు, మైనర్లు బైక్‌లపై పరుగులు తీయడంతో పలు బస్తీల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, అదనపు పోలీసు కమిషనర్ విక్రం సింగ్‌మాన్, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా తదితరులు మక్కా మసీదు నుంచి బయలు దేరిన ర్యాలీకి స్వాగతం పలికారు. ర్యాలీలో పాల్గొన్న ముస్లిం తమ పెద్దలను ఘనంగా సత్కరించారు. దారిపొడవునా స్వచ్ఛంద సంస్థలు ఆహార పదార్థాలు, తాగునీరు, పానియాలను అందజేశారు.

సందడే..సందడి..

పాతబస్తీలో ఇతర ప్రాంతాల నుంచి బయలుదేరిన సామూహిక ర్యాలీలన్నీ మక్కా మసీదుకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనల అనంతరం చార్మినార్, గుల్జార్ హౌజ్, పత్తర్‌గట్టి, మదీనా, చెత్తబజార్, పురానీహవేలి, మీరాలంమండి, కోట్లా ఆలిజా, బీబీబజార్, మొఘల్‌పురా ద్వారా మొఘల్‌పురా ఓల్డా హోటల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు చేరుకున్నాయి. తిరిగి కొంత మంది మళ్లీ యథావిధిగా వచ్చిన దారుల్లోనే చక్కర్లు కొట్టారు. మరో ర్యాలీ మక్కా మసీదు నుంచి నాంపల్లిలోని హజ్ వరకు కొనసాగింది. ఇక ర్యాలీల సందర్భంగా ఆయా రోడ్లలో దక్షిణ మండలం ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. జంగమ్మెట్‌లోని ఖాద్రీ చమాన్ దర్గా నుంచి ప్రధాన ర్యాలీ చార్మినార్–మక్కా మసీదు వైపు కొనసాగింది. యాకుత్‌పురా, తలాబ్‌కట్టా, పురానీ హవేలీ, డబీర్‌పురా, జంగమ్మెట్, చాంద్రాయణగుట్ట, మహ్మద్ నగర్, ఈదిబజార్, అక్బర్‌నగర్, మొయిన్‌బాగ్, బన్నాక, నషెమాన్‌నగర్, ఫతేషానగర్, నఫీజ్‌నగర్, బాబానగర్, ఉప్పుగూడ, బార్కాస్, తాళ్లకుంట, అల్ జుబేల్ కాలనీ, పురానాపూల్, హుస్సేనీఆలం, బహదూర్‌పురా, కిషన్‌బాగ్, తాడ్‌బన్, షంషీర్‌గంజ్, కామాటిపురా తదితర ప్రాంతాల్లో మిలాద్–ఉన్–నబీ వేడుకల సందడి కనిపించింది.

పోలీస్ భారీ బందోబస్తు..

చాంద్రాయణగుట్ట: మిలాద్–ఉన్–నబీ ర్యాలీలను పురస్కరించుకొని ఫలక్‌నుమా పరిసరాల్లో పోలీసులు ఆదివారం భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. జంగమ్మెట్‌లోని ఖాద్రీ చమాన్ దర్గా నుంచి ప్రారంభమైన ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఛత్రినాక, ఫలక్‌నుమా, శాలిబండ పోలీసులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. ఫలక్‌నుమా, ఇంజన్‌బౌలి, శంషీర్‌గంజ్, అలియాబాద్, లాల్‌దర్వాజా మోడ్, శాలిబండ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు.